# సరే కానివ్వండి

దారికి అడ్డొచ్చిన
నీడనిచ్చే చెట్లు విరుగుతున్నాయి
దారి తప్పుకోలేని
ఎదుగుతున్న మొక్కలు వొరుగుతున్నాయి
రక్తం రుచెరిగిన మృగాలు
అడవి నుండి బయటపడ్డట్టు
ఊరు ఊరంతా వీర విహారం చేస్తూ
ఒంటిని పులుముకున్న రక్తాన్ని
గుట్టుచప్పుడు కాకుండా కడిగేసుకుంటున్నాయి
గుమ్మానికి వేలాడిన కళ్లకి
వార్తాశూలాలు
కలుక్కున దిగి రక్తాలు కారుతున్నాయి
నేల రాలిన వెంటనే ఏ ఊతదొరికినా
రాలిపడ్డ శబ్దం కావల్సిన వాళ్ల చెవులకు సోకినా
మందో మాకో వెంటనే వేసినా
మామూలు పచ్చదనం
తిరిగొచ్చేదే కదా అని
తల్లి వేళ్లు అరిచి అరిచి అలిసి పోతున్నాయి
గుర్తొచ్చినప్పుడల్లా
పిల్లవేళ్ల గుండెలు వణికి పోతున్నాయి
ఏ రోజుకారోజు జీవించటానికి
యుద్ధోన్ముఖులవుతున్న జీవాలు
పోస్టుమార్టం శవాలో
శవవాహకులో అవుతున్నాయి
పోయిన వాళ్లు, పోగొట్టుకున్న వాళ్లు అపరాధుల్లా
కారుణ్యం చూపిన కళ్లు వాచేలా

కళ్లు గప్పిన చేతులు తుడిచేలా
చేలు మేస్తున్న చీకట్లకు పందిరిలా
కాపలా లాఠీలు కవాతు చేస్తున్నాయి

ఉపరితల విన్యాసంలాంటి జీవితాలు
ప్రమాద భరితాలే అయినప్పుడు
బతకటానికో, చావటానికో
తరతరాలకు సరిపోయే
వేదాంత వేద పారాయణం
అందరి దగ్గరా ఉండనే ఉంది
సరే! కానివ్వండి!

( నగరంలో రోజురోజుకూ జరుగుతున్న అనవసర అమానుష ప్రమాదాల పట్ల నిర్లిప్తతకు నిరసనగా)